క్లుప్తంగా

మొబైల్ యాప్ ల్యాబ్ సేవలు ప్రారంభం



సేవలకు సిద్ధమైన మొబైల్ యాప్ ల్యాబ్ సిబ్బంది

గోపాలపట్నం : నగరంలో ప్రప్రథమంగా ఎస్ఏడీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 24 గంటల హాస్పిటల్ మొబైల్ యాప్ ద్వారా ల్యాబ్ సేవలు అందించే కార్యక్రమాన్ని బుధవారం ఎండీ టి.సురేష్ ప్రారంభించారు. యాప్ ద్వారా నగర పరిధిలో 24 గంటలు ఇంటికి వచ్చి శ్యాంపిల్స్ తీసుకోవడంతో పాటు, నివేదికను ఫోన్‌కు పంపిస్తామని తెలిపారు. అంతే కాకుండా వైద్యుల ఉచిత కన్సల్టేషన్ లభిస్తుందని సురేష్ తెలిపారు. ఈ సేవలు 24 గంటలు లభిస్తాయన్నారు. నగరంలో ఇలాంటి సేవలు తొలుత తామే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

సాకేతపురంలో వానరాల బెడద



సాకేతపురంలో ఓ ఇంటి వద్ద కోతి

గోపాలపట్నం: జీవీఎంసీ 57వ వార్డు ఎన్ఏడీ పరిధి సాకేతపురంలో కోతుల బెడదతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపై, ఇంటి నుంచి బయటకు వెళ్లే పెద్దలపై దాడి చేస్తుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే ప్రాంతంలో కోతులు గుంపులుగా వస్తున్నాయని వాపోతున్నారు. చిన్నారుల చేతుల్లో తినుబండారాల కోసం, మహిళలు దుస్తులు ఆరబెట్టే సమయంలో మేడలపైకి ఒక్కసారిగా వారిపై దాడులు చేస్తున్నాయి. ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి ఉంటే లోపలికి చొరబడి ఆహార పదార్థాలు, వంట సామగ్రి చిందర వందర చేస్తున్నాయి. అధికారులు స్పందించి వానరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శభాష్ వలంటీర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వీరజుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన వలంటీర్ కాండ్రేగుల సురేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆకన వీరజు(72) అనే మహిళకు పింఛన్ నగదు అందజేశాడు. వీరజు ఆరోగ్యం క్షీణించడంతో 10 రోజుల నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఇది గమనించిన వలంటీర్ సురేష్ బుధవారం కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సురేష్‌ను అభినందించారు.

మంచు కురిసె.. మనసు మురిసె



పారిశ్రామిక ప్రాంతం ఒక్కసారిగా శ్వేతవర్ణం అద్దుకుంది. స్ఫటికాల్లాంటి మంచు ఎక్కడికక్కడ పేరుకుపోయి కనులకింపుగా కానవచ్చింది. వాతావరణంలో మార్పో.. బుధవారం తెలతెలవారే పడిన వర్షమో కారణం ఏదైతే కానీ.. తెల్లారి లేచిన వెంటనే ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. రోడ్డంతా తెల్లటి మబ్బు పరుచుకుపోవడంతో వాహనాల రాకపోకలకు కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. గత నాలుగు రోజుల నుంచి చలి తగ్గటం, కొంచెం ఉక్కపోత ఉండడంతో ఇదేం ఎఫెక్ట్ అనుకుంటున్న వారికి బుధవారంఉదయం కురిసిన వర్షం.. అలుముకున్న శీతలం ఉపశమనం కలిగించాయి. – మల్కాపురం

సింహాచలం వచ్చే మార్గాల్లో స్వాగత ద్వారాలు

- ఈవోకు సూచించిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహాచలం వచ్చే మార్గాల్లో దేవస్థానం స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు సూచించారు. సింహగిరిపై ఆలయ బేడా మండపంలో బుధవారం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ పలు అభివృద్ధి పనుల విషయంపై ఈవోతో సమావేశమయ్యారు. పెందుర్తి ఆనందపురం కొత్త మార్గంలో సింహాచలం వెళ్లే రహదారిలో స్వాగత ద్వారం ఏర్పాటు చేయాలని సూచించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆమార్గంలో వచ్చే భక్తులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకుందని తెలియజేశారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మిస్తున్న కల్యాణ మండపాల పనులు వేగవంతం చేసి తక్షణమే భక్తులకు అందుబాటులోకి తేవాలని.. కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని సత్రాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సింహగిరి మెట్లమార్గం అభివృద్ధి చేయాలని, కనుమ రోజు స్వామివారు కొండదిగువకు వస్తారని గుర్తుచేశారు.

చందనం సమర్పణకు రూ. 50వేల విరాళం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ రూ. 50 వేల విరాళం చెక్కురూపంలో ఈవో త్రినాథరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల హర్షాతిరేకాలు



మల్కాపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

మల్కాపురం : సంక్షేమం అంటే సీఎం జగన్.. జగన్ అంటే సంక్షేమం అని వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ అన్నారు. 61వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లోని సచివాలయాల వద్ద కొత్త పింఛన్ల పంపిణీ బుధవారం చేపట్టారు. లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ వార్డు పరిధిలో 60 కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన వారికి పింఛన్లు కేటాయించారని.. వాటిని నేడు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, వరలక్ష్మి, నూకరాజుతో పాటు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్



నిందితుడిని విచారిస్తున్న సెబ్ సీఐ సరోజదేవి తదితరులు

సింహాచలం: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని బుధవారం పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలోకి వెళ్తే.. బుధవారం పెందుర్తి సెబ్ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా పెందుర్తి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద మూడు కిలోల డ్రై గంజాయి ఉండటంతో అతన్ని అరెస్టు చేశారు. సెబ్ సీఐ సరోజదేవి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ సమాచారం

మూల్యాంకన కేంద్రం పరిశీలన



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం ఉదయం పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియను వేగవంతం చేసేలా కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్రం పరిసరాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని యూనివర్సిటీ ఇంజినీర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, వజీర్ మహ్మద్, యూనివర్సిటీ ఇంజనీర్స్ ఆర్.శంకరరావు, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ మెంటార్ ట్రెనింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతను భాగం చేయాలని కోరారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి రెండూ సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆలోచన సరళిలో మార్పు తీసుకురావడానికి కృషి జరగాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ మాట్లాడుతూ అధ్యాపకులు మార్పునకు వాహకాలుగా నిలుస్తారన్నారు. విద్యార్థులను కమ్యూనిటీ సర్వీస్ దిశగా నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న తీరును తెలియజేశారు. రిసోర్స్ పర్సన్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశం కోసం పాటు పడేలా యువతను తీర్చిదిద్దడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన 68 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

లెర్నర్ పోర్టల్‌లో కోర్సు మెటీరియల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోర్సు మెటీరియల్‌ను లెర్నర్ పోర్టల్‌లో పొందుపరిచారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో దీనిని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ గుర్తింపు నంబరును నమోదు చేసి కోర్సు మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజోలు ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న కుమార్‌రాజా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం పరిశోధక విద్యార్థి పాలపర్తి కుమార్‌రాజాకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య నల్లా సత్యనారాయణ పర్యవేక్షణలో 'హిందీ దళిత్ ఆత్మ ఆథావో మే అభివ్యక్త్ వ్యక్తిత్వ వికాస్' అంశంపై ఆయన జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను కుమార్‌రాజా స్వీకరించారు. ప్రస్తుతం కుమార్‌రాజా రాజోలులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల హిందీ జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



చింతల అగ్రహారం శ్రీకృష్ణాలయంలో దీపాలంకరణ సేవ



విశేష అలంకరణలో గోదాదేవి


సింహాచలం: ధనుర్మాస పూజలు బుధవారం పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారు జామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరు వీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు.

- పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవి చెంతన ప్రత్యేక పూజలు చేసి హారతులు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తుకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజల ను నిర్వహించారు.
- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అ మ్మవారిని విశేష అలంకరించారు. పాశుర విన్నప పా రాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.
- పెందుర్తి మండలం చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో శంఖుచక్రనామాలకు విశేషంగా దీపాలంకరణ చేశారు. పాశురవిన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు.

చీటీల పేరుతో మోసంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ: చీటీల పేరుతో స్థానికుల నుంచి భారీగా నిధులు సమీకరించి కుచ్చు టోపీ పెట్టిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పుఘర్‌తో పాటు ఎంవీపీ కాలనీ, వాసవానిపాలెం ప్రాంతాలకు చెందిన వారి నుంచి వి.సూర్యకుమారి అనే మహిళ దసరా, పప్పులు, లాటరీ చీటీల పేరుతో రూ.40 లక్షలకు పైగా వసూలు చేసింది. కొంత కాలంగా చీటీల డబ్బులు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతుండడంతో స్థానికులు నిలదీశారు. పలువురు బాధితులు బుధవారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ ఎదుట తమకు న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యకుమారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

కవిత్వం అజరామరం



మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: కవిత్వం హృదయ రంజకంగా, అలంకారయుక్తంగా, సందేశాత్మకంగా ఉండాలని ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ప్రాచీన కవుల సాహిత్యం మార్గదర్శకం కావాలని, సాహిత్యం ప్రతి ఒక్కరి సొత్తు, కవిత్వం అజరామరం, సమాజాన్ని సరైనా దారిలో నడిపేది కవిత్వమన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి సంస్థ 42 ఏళ్లుగా సాహిత్య సేవ చేస్తూ, తెలుగు సాహిత్యానికి, కవులకు ఒక అధ్యయన కేంద్రంగా, ఎందరో కవులకు మార్గదర్శకంగా విలసిల్లుతోందన్నారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ కవి అదృష్ట దీపక్ రచనలను సభకు పరిచయం చేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పి.ఎల్.వి. ప్రసాద్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, టి.పట్టాభి రామారావు, డి.వి.సూర్యారావు, దేవులపల్లి పద్మజ, పంతుల లలిత, కుప్లి భీమేశ్వరరావు, పి.వి.ఆర్.కె.రావు, రామతాత, వై.సత్యవతి, కె.రఘువీర్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

యోగాతో ఆరోగ్యం

మురళీనగర్: యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మురళీనగర్ సమీపాన తెన్నేటినగర్‌లో బుధవారం 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి క్షీరాబ్ధి యోగా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన పూర్వీకులు, రుషులు కనుగొన్న యోగా ప్రక్రియలు నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందినట్లు వివరించారు. కొన్ని రకాల యోగాసనాలు, వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని శోషరస ద్రవాలు పెరిగి వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా తన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్, గురుదేవా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు పాల్గొన్నారు.

63వ వార్డులో నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్ నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి

సింధియా: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ నగదుతో పాటు కొత్తగా అర్హత సాధించిన పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ మేరకు 63వ వార్డు పరిధిలోని పలువురు లబ్ధిదారులకు వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హత గల ప్రతి ఒక్కరికి పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం

- పూర్వ విద్యార్థులు కలిసిన వేళ



వేదిక వద్ద దండలు మార్చుకుంటున్న నాటి గణిత బోధకురాలి దంపతులు

మల్కాపురం : వారంతా సుమారు 36 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. ఇప్పుడు వారంతా ఒకచోట కలుసుకుని వెనుకటి రోజుల్లో చేసిన అల్లరి, చదువులో పోటీ తదితర అంశాలపై చర్చించుకున్నారు. ఎలా ఉన్నావు మిత్రమా.. ఎన్నేళ్లయింది.. మనం ఇలా కలుస్తామని అనుకోలేదు.. అంటు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగనాలు చేసుకున్నారు. 61వ వార్డు పరిధి మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1986–87 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు బుధవారం ఒక చోట కలుసుకున్నారు. స్థానికంగా ఉన్న ముప్పిడి వెంకటగిరి, బంక సంజీవ్ తదితరులు ఇటీవల కలుసుకుని నాడు తమతో చదువుకున్న వారితో ఒక సమావేశం ఏర్పాటు చేసుకుందామని అనుకున్నారు. దీంతో వారు వివిధ ప్రాంతాల్లో ఉన్న నాటి మిత్రుల ఫోన్ నంబర్లు సేకరించి వారితో మాట్లాడి ఆత్మీయ కలయికకు రావాలని ఆహ్వానం పలికారు. దీంతో అందుబాటులో ఉన్న నాటి మిత్రులు ఒక్కచోట చేరి ఆత్మీయంగా గడిపారు. వీరిలో కొంత మంది నాటి సినిమా పాటలు అందరినీ సంతోషపరిచారు. అనంతరర తమకు గణితం బోధించిన బంగారుచిట్టి మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు.

హెచ్ఎస్‌జీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు ఏయూ వీసీకి ఆహ్వానం



ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న హెచ్ఎస్‌జీ గోల్డెన్ జూబ్లీ అపెక్స్ కమిటీ ప్రతినిధులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించకుని ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి హెచ్ఎస్‌జీ గోల్డెన్ జూబ్లీ అపెక్స్ కమిటీ ప్రతినిధులు బుధవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఈ మేరకు ప్రసాదరెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో అపెక్స్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ అప్పారావు, శ్రీనివాసరెడ్డి, శరగడం వెంకట్, గుండుబోయిన మురళీకృష్ణ, ఆనంద్, ఏయూ రిజిస్ట్రర్ట్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న యునైటెడ్ ప్యానల్ అభ్యర్థులు

ఉక్కునగరం: స్టీల్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మూడు ప్యానళ్ల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జ్యోతిరావు పూలే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ బుధవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రచారం నిర్వహించారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే మరిన్ని హక్కులు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహాలక్ష్మి నాయుడు, నమ్మి తాతారావు, పిల్లి చంద్రరావు, కొణతాల శ్రీనివాస్, కె.జె. అప్పారావు, వి.సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- యునైటెడ్ ప్యానల్‌ను గెలిపించాలని ప్యానల్ అధ్యక్ష అభ్యర్థి బి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ఎం. శ్రీనివాసరావు కోరారు. బుధవారం మెయిన్ గేటు వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తమ ప్యానల్‌ను గెలిపిస్తే ఓబీసీ ఉద్యోగుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వై.ఎల్. నాయుడు, ఆర్.వి. నారాయణ, కోయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 692వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో డబ్ల్యూ.ఎం.డి, యుటిలిటీ, అడ్మిన్, టీఏ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని మన రాష్ట్ర పార్లమెంట్ సభ్యులందరూ కలిసి ప్రస్తుత పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కొవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరావు, వివిఎస్.వరప్రసాద్, బి.బాలస్వామి, ఎన్.నాగార్జున, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

3 ద్విచక్ర వాహనాల వేలం

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయంలో బుధవారం 3 ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించారు. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.61,242 ఆదాయం వచ్చినట్టుగా అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.శ్రీనాథుడు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చినా.. తీసుకెళ్లకపోవడంతో, కోర్టు అనుమతితో వేలం వేసినట్టు ఆయన చెప్పారు. వేలంలో పలువురు పాల్గొని నిర్ణయించిన ధరకు వాటిని దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్కిల్–4 సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.